

కందిపప్పు లేదు..!



ఈ నెల రేషన్‌లోనూ సరఫరా చేయని ప్రభుత్వం

ప్రజా పంపిణీ వ్యవస్థలో సమూల మార్పులు తీసుకొస్తామని, ప్రక్షాళన చేస్తామని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి మనోహర్ బాధ్యతలు తీసుకున్నప్పటి నుంచి చెబుతూనే ఉన్నారు. గత ప్రభుత్వం చేసిన తప్పులను సరిదిద్ది కూటమి సర్కారు ప్రజా పంపిణీ వ్యవస్థను గాడిలో పెడుతుందంటూ

బహిరంగ మార్కెట్‌లో కిలో రూ.200పై మాటే

చెప్పుకొచ్చారు. అయితే ఆచరణలో పూర్తి స్థాయిలో సరుకుల పంపిణీపై దృష్టి సారించలేకపోతున్నారు. ఆరు నెలలుగా అందరికీ కందిపప్పు సరఫరా కావట్లేదు. ఈ నెల 30 శాతం మందితో సరిపెట్టారు. కేవలం బియ్యం, పంచదారతోనే సరిపెడుతున్నారు...

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

కర్నూలు జిల్లాలో 1,228 రేషన్ షాపులు ఉండగా వాటి పరిధిలో 6,76,209 రేషన్ కార్డులు ఉన్నాయి. నంద్యాల జిల్లాలో 5,41,804 రేషన్‌కార్డులు ఉన్నాయి. వాటికి నెలనెలా బియ్యం, కందిపప్పు, పంచదార పంపిణీ జరుగుతుంది. కందిపప్పును మాత్రం రెండు నెలలుగా ఇవ్వట్లేదు. ఒక్కో కార్డుకు కిలో కందిపప్పు ఇవ్వాల్సి ఉంది. ఈ లెక్కన నెలకు కర్నూలు జిల్లాకు 676.209 మెట్రిక్ టన్నులు, నంద్యాల జిల్లాకు 541.804 మెట్రిక్ టన్నుల కందిపప్పు అవసరం ఉంది. జిల్లాలో కొన్ని నెలలుగా కందిపప్పు సరఫరా పూర్తిస్థాయిలో జరగడం లేదు. ఆరు రెండు నెలలుగా అందరికీ కందిపప్పు అందడం లేదు. ఈ నెల 30 శాతం కార్డులకు మాత్రమే కందిపప్పు పంపిణీ చేశారు. దీంతో పేదలు పప్పునీళ్లకు కూడా దూరమయ్యారు. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా లబ్ధిదారులకు సరఫరా చేయాల్సిన సరుకులను ప్రభుత్వం క్రమంగా తగ్గిస్తూ వస్తుంది. గతంలో టిడిపి ప్రభుత్వం క్రిస్మస్, సంక్రాంతి కానుక, రంజాన్ తోఫా అంటూ అవసరమైన సరుకులను రేషన్ షాపుల ద్వారా ఇచ్చేవారు. 2019లో వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత బియ్యం మాత్రమే పూర్తిస్థాయిలో ఇచ్చారు. ప్రతి నెలా కందిపప్పు అరకొరగానే పంపిణీ చేశారు. పండుగ తోఫాలకు ఫుల్‌స్టాప్ పెట్టారు. ఈ ఏడాది జూన్లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం పౌరసరఫరాల శాఖపై నిర్వహించిన సమీక్ష సందర్భంగా అన్ని సరుకులను పంపిణీ చేయనున్నట్లు ప్రకటించారు. కాని ప్రస్తుతం పరిస్థితి భిన్నంగా ఉంది. కనీసం కందిపప్పు కూడా సరఫరా చేయకపోవడంతో లబ్ధిదారుల్లో నిరాశే మిగిలింది. దీపావళికి, దసరాకు, సంక్రాంతికి కూడా కందిపప్పు అందకపోవడంతో పేదలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

బహిరంగ మార్కెట్లో కొనలేక

ప్రజలు నిత్యం వాడే కందిపప్పు నాణ్యతను బట్టి ధర రూ.180 నుంచి 200 వరకూ ఉంది. రాయితీ పోను కిలో కందిపప్పు రూ.67కే లభిస్తున్నందున రేషన్ షాపుల ద్వారా కందిపప్పు పంపిణీ చేయాలని లబ్ధిదారులు కోరుతున్నా కూటమి సర్కారు సైతం పట్టించుకోవడం లేదు. కందిపప్పు ధర భారీగా పెరగడంతో పేద, మధ్య తరగతి ప్రజలు కొనలేని స్థితిలో ఉన్నారు. ఇప్పటికే నిత్యవసర సరుకుల ధరలు విపరీతంగా పెరుగుతున్నాయి. దానికి తోడు పేదలపై భారాలు రోజురోజుకి ఎక్కువ అవుతున్నాయి. దీంతో కందిపప్పు కొనుగోలు చేయలేని దుస్థితి ఏర్పడింది. నిత్యావసర వస్తువుల ధరలు తగ్గిస్తున్నామనే పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా రైతు బజార్ల ద్వారా ప్రభుత్వం కందిపప్పు పంపిణీ చేపట్టింది. అది నాణ్యత తక్కువగా ఉండడంతో వినియోగదారులు కొనుగోలు చేసేందుకు అంతగా ఆసక్తి చూపడం లేదు. బహిరంగ మార్కెట్లో ఉన్న ధరపై రూ.10 నుంచి రూ.20 వరకు కిలోపై ధర తగ్గిస్తున్నా, ఇది రెండో రకం కందిపప్పు కావడంతో తీసుకునేందుకు ఎవరూ ఇష్టపడడం లేదు.

కేంద్ర బడ్జెట్‌లో ఎపికి అన్యాయం

- బిజెపి, టిడిపి కూటమిని నిలదీయాలి

- సిపిఎం ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

కేంద్ర బడ్జెట్‌లో ఎపికి అన్యాయం చేశారని, అన్యాయం చేసిన బిజెపిని, రాష్ట్రానికి నిధులు రాబట్టడంలో విఫలమైన టిడిపి కూటమిని నిలదీయాలని సిపిఎం నాయకులు కోరారు. బడ్జెట్‌ను నిరసిస్తూ కర్నూలు న్యూ సిటీ కమిటీ ఆధ్వర్యంలో సుందరయ్య సర్కిల్ కొత్త బస్టాండ్ దగ్గర, ఓల్డ్‌సిటీ పూల బజార్ పొట్టి శ్రీరాములు విగ్రహం ముందు, ఓర్వకల్లు మండలం నన్నూరులో సిపిఎం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు కె. సుధాకరప్ప అధ్యక్షతన నిర్వహించిన నిరసనలో సిపిఎం నగర కార్యదర్శివర్గ సభ్యులు ఆర్.నరసింహులు, సిహెచ్ సాయిబాబా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఎపికి అన్యాయం చేసినా చంద్రబాబు కూటమి స్పందించలేదని, దీన్ని ప్రజలు గమనించాలని కోరారు. కేంద్ర బడ్జెట్ ఎపి ప్రజల ఆశలను అడియాసలు చేసిందన్నారు. కేంద్ర బిజెపి మరోసారి చేసిన ఈ ద్రోహానికి వ్యతిరేకంగా రాష్ట్ర ప్రజలు నిరసన వ్యక్తం చేయాలని కోరారు. చంద్రబాబు నాయుడు స్పందించి కేంద్రంతో మాట్లాడి నిధులు రాబట్టక పోతే రాబోయే రోజుల్లో సిపిఎం పెద్ద ఎత్తున పోరాటానికి సిద్ధమవుతుందని వారు హెచ్చరించారు. సిపిఎం కొత్త నగర నాయకులు శంకర్, భాస్కర్, ఏసు, చిన్న ఆనంద్, రామకష్ణ, సి. చలపతి, శ్రీనివాసులు, రాఘవేంద్ర, రాగప్ప పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు ఆర్.నరసింహులు

జిల్లాకు మొండి చేయి : కేంద్ర బడ్జెట్లో రాష్ట్రానికి, కర్నూలు జిల్లాకు మొండి చేయి చూపిన బిజెపి ప్రభుత్వంపై సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్ఎండి.షరీఫ్, అబ్దుల్ దేశాయ్, కె.రామకృష్ణులు విమర్శించారు. నగర కమిటీ సభ్యులు ఎస్‌డి.కాజా పాషా అధ్యక్షతన నిర్వహించారు. సిపిఎం నాయకులు మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వపై నరేంద్ర మోడీ, అమిత్‌షాల జోడి ఆంధ్ర ప్రదేశ్ చేటూగా మారుతుందని, తెలుగు నాట ప్రజలు తెలుసుకోవాలని కోరారు. బడ్జెట్లో విభజన హామీలకు సంబంధించి నిధులు, కడప ఉక్కు ఫ్యాక్టరీ ఊసు లేదన్నారు. వెనుకబడిన రాయలసీమ జిల్లాల సంబంధించిన ప్రాజెక్టుల నిర్మాణ , రైల్వే లైన్ నిర్మాణం , మంత్రాలయం నుండి శ్రీశైలం రైల్వే మార్గం, కర్నూలు నుండి రాజధానికి ఇంటర్సిటీ ఎక్స్‌ప్రెస్ లాంటివి ఏ ఒక్కటి కూడా ఈ బడ్జెట్ లో లేవన్నారు. సిపిఎం నగర కమిటీ సభ్యులు మహబూబ్ బాషా, నాగరాజు, మద్దిలేటి, శ్రీనివాసులు, చాంద్ భాషా, రమేష్ గొట్టం, బాబు , హాజీ భాష,శాలి భాష ,మన్యం, హర్షదు ,గోపాల్ ,జాకీ ,లక్ష్మణ్, సుధాకర్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు కలెక్టరేట్ : బడ్జెట్లో రాష్ట్రానికి కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ద్రోహం చేసిందని సిపిఎం మండల కార్యదర్శి జి.నాగన్న విమర్శించారు. ఓర్వకల్ మండలం పరిధిలోని నన్నూరులో సిపిఎం ఆధ్వర్యంలో కేంద్ర బడ్జెట్ పైన నిరసన తెలిపారు. గ్రామ నాయకులు ఎస్.మధుసూదన్ అధ్యక్షతన జరిగిన నిరసనలో బి నాగన్న మాట్లాడారు. నాయకులు మాసుంబాష ,వెంకటేశ్వర్లు, అన్నయ్య, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రామస్వామి, షరీఫ్ శాలిమియా తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు ఎస్ఎండి షరీఫ్


నన్నూరులో నిరసన తెలుపుతున్న నాయకులు

లాభాపేక్ష లేకుండా బిఎస్ఎన్ఎల్ సేవలు

- అత్యుత్తమ సేవలందించేందుకు కృషి

- ప్రజాశక్తితో బిఎస్ఎన్ఎల్ పిజిఎం రమేష్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

బిఎస్ఎన్ఎల్ ద్వారా వినియోగదారులకు అతి తక్కువ ధరలో అత్యాధునిక సౌకర్యాలతో అన్నిచోట్ల అందుబాటులో ఉంటూ అత్యుత్తమమైన సేవలు అందిస్తోందని బిఎస్ఎన్ఎల్ ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ జి.రమేష్ తెలిపారు. లాభాపేక్ష లేకుండా బిఎస్ఎన్ఎల్ సేవలందిస్తోందని పేర్కొన్నారు. మార్చి లోపల అన్ని టవర్ల పరిధిలో 4జి సేవలు అందిస్తామన్నారు. ప్రజాశక్తితో ఆయన ముఖాముఖిగా మాట్లాడారు..



4జి సేవలు అందించేందుకు ఎప్పటి లోపల పూర్తి చేస్తారు?

పిజిఎం: 4జి సేవలు అందించేందుకు 336 టవర్లకు గాను 310 టవర్లు పూర్తి చేశాం. మిగిలినవన్నీ మార్చి లోపల పూర్తి చేస్తాం.

బిఎస్ఎన్ఎల్ సేవలు కవరేజ్ లేని కొత్త ప్రాంతాలలో విస్తరిస్తున్నారా?

పిజిఎం: ఇంత వరకు ఏ టెలికాం ఆపరేటర్ కూడా మొబైల్ సేవలను అందివ్వని 7 ప్రాంతాలైన ప్యాపిలి మండలంలోని వెన్నలంపల్లి, బనగానపల్లి మండలంలోని కటిక వాణి కుంట, రామతీర్థం, ఆస్పరి మండలంలోని యాటకల్లు, దేవనకొండ మండలంలోని పులికొండ, హాలహర్వి మండలంలోని విరుపాపురం, పెద్దకడబూరు మండలంలోని దొడ్డి మేకల పల్లి ప్రాంతాలలో మొబైల్ టవర్లను కొత్తగా 4జి శాచ్యురేషన్ ప్రాజెక్టు కింద ఏర్పాటు చేశాము.

ల్యాండ్ లైన్ ఫోన్లు ఎన్ని ఉన్నాయి? ఫైబర్ కనెక్షన్లు ఎన్ని ఉన్నాయి?

పిజిఎం: ల్యాండ్ లైన్ ఫోన్లు ప్రభుత్వ కార్యాలయంలో మాత్రమే 1800 కనెక్షన్లు ఉన్నాయి. ఫైబర్ కనెక్షన్లు 16,500 ఉన్నాయి.

వినియోగదారులు 4జి సేవలు పొందేందుకు ఏం చేయాలి?

పిజిఎం: బిఎస్ఎన్ఎల్ వినియోగదారులు 4జి , 5జి సేవల పొందేందుకు పాత సిమ్ లను ఇచ్చి 4జికి అప్ గ్రేడ్ చేసుకోవాలి. అందుకోసం దగ్గరలోకి బిఎస్ఎన్ఎల్ ప్రాంఛైజీలను కానీ, కార్యాలయాలను కానీ సంప్రదించాలి.

ఎంపీల సమావేశంలో ఏం నిర్ణయం తీసుకున్నారు?

పిజిఎం: కవరేజ్ లేని ప్రాంతాలను కొత్త టవర్స్ కోసం ప్రభుత్వానికి మా తరఫున లేఖ రాస్తామన్నారు.

బిఎస్ఎన్ఎల్ లో పదవి విరమణ చేసిన తర్వాత కొత్తగా ఉద్యోగాల్లో తీసుకోవడం లేదు. పని ఒత్తిడి పెరిగిందా?

పిజిఎం: రెండు సంవత్సరాలు టెండర్ ద్వారా అవుట్సోర్సింగ్‌లోకి వెళ్ళాము. జిల్లాలో వంద మందికి పైగా టిబిపిలు ఉన్నారు. ఫైబర్ సేవలకు అవకాశం ఇవ్వటం వల్ల వారికి 50 శాతం కమిషన్ ఇస్తున్నాం.

జిల్లాలో సర్వీస్ సెంటర్లు ఎన్ని ఉన్నాయి? సిబ్బంది ఎంత మంది ఉన్నారు?

పిజిఎం: కర్నూలు జిల్లాలో 8, నంద్యాల జిల్లాలో 12 కస్టమర్ సర్వీస్ సెంటర్లు ఉన్నాయి. బిఎస్ఎన్ఎల్‌లో 93, ఏబిసిడి గ్రూప్ లో 217 మంది, నాన్ ఎగ్జిక్యూటివ్‌లు 124 మంది పనిచేస్తున్నారు.

బిఎస్ఎన్ఎల్‌లో కొత్తగా వచ్చిన ఫైబర్ ఇంటర్నెట్, మొబైల్ ప్లాన్లు వివరాలు చెప్తారా?

పిజిఎం: బిఎస్ఎన్ఎల్ ఎఫ్టిటిహెచ్ సర్వీస్‌లలో కొత్తగా భారత్ ఫైబర్ త్రైమాసికం మరియు అర్ధ సంవత్సరం బ్రాడ్బ్యాండ్ ప్లానును ప్రవేశపెట్టాము. ఫైబర్ ఎంట్రీ క్వార్టర్లీ ప్లాను కింద రూ.999తో 25 ఎంబిపిఎస్ స్పీడుతో 1200 జిబి వరకు, ఫైబర్ ఎంట్రీ అర్ధ సంవత్సరం ప్లాన్ కింద రూ.1999తో 25 ఎంబిపిఎస్ స్పీడుతో 1300 జిబి వరకు అన్ని గ్రామీణ, పట్టణ ప్రాంతాల వారికి అందిస్తున్నాం.

విద్యామిత్ర స్కీమ్ గురించి వివరాలు తెలపండి?

పిజిఎం: విద్యామిత్ర స్కీం కింద ఇంటర్‌నెట్ అవసరం ఉన్న విద్యార్థులకు దాతలు ఇంటర్‌నెట్ సేవలను విరాళంగా అందిచవచ్చు. సంవత్సరం పాటు ముగ్గురికి అయితే రూ.11వేలు, ఆరుగురికి రూ.21 వేలు, 10 ఇంటర్నెట్ కనెక్షన్లకు రూ.35 వేలు ఇవ్వవచ్చు.

టివి సర్వీసులను తీసుకొస్తున్నారా?

పిజిఎం : త్వరలో బిఎస్ఎన్ఎల్ లైవ్ టీవీ సర్వీసులు ఎఫ్‌టిటిహెచ్ ఇంటర్నెట్ కనెక్షన్ ద్వారా సుమారు 500కు పైగా టీవీ చానల్స్ అందచేస్తాం. బిఎస్ఎన్ఎల్ లైవ్ టీవీ సర్వీసులు ఇప్పటికే రాజస్థాన్ రాష్ట్రంలో విజయవంతమైందని తెలిపారు. కర్నూలు జిల్లా వ్యాప్తంగా ఉన్న 210 ఓఎల్‌టిఈలతో సుమారు 16,400 భారత్ ఫైబర్ కస్టమర్లకు నాణ్యమైన సేవలను అందిస్తున్నాం. త్వరలోనే మిషన్ 20కె నినాదంతో మా టెలికామ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ప్రొవైడర్స్, బిఎస్ఎన్ఎల్ ఉద్యోగుల సమిష్టి కృషితో 20 వేల ఎఫ్‌టిటిహెచ్ కనెక్షన్లను అతి త్వరలోనే వినియోగదారులకు ఇస్తాం.

బిఎస్ఎన్ఎల్ వైఫై రోమింగ్ ఎలా ఉపయోగించుకోవాలి?

పిజిఎం : బిఎస్ఎన్ఎల్ వైఫై రోమింగ్ సేవను యాక్సెస్ చేయడానికి బిఎస్ఎన్ఎల్ ఎఫ్‌టిటిహెచ్ కస్టమర్ పోర్టల్ https://portal. bsnl.in/ftth/ wifiroaming నందు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. రిజిస్ట్రేషన్ చేసుకున్న బిఎస్ఎన్ఎల్ వైఫై యూజర్లు ఇంటి నుండి బయటికి వచ్చాక రోమింగ్‌లో ఉన్నప్పుడు కూడా ఆ ప్రాంతంలో సర్వత్రా బిఎస్ఎన్ఎల్ వైఫై హాట్స్పాట్ రిజిస్ట్రేషన్ చేసుకున్న వేరొక కస్టమర్ నుండి హై స్పీడ్ ఇంటర్నెట్ సేవలను ఎటువంటి అనుమతి అవసరం లేకుండా పొందవచ్చు. రోమింగ్‌లో ఉన్న కస్టమర్ యొక్క వినియోగం అతని ఖాతాలోనే లెక్కించబడుతుంది. రోమింగ్‌లో నాలుగు పరికరాలతో లాగిన్ అవ్వవచ్చు.

మంత్రిని కలిసిన ఎస్‌పి విక్రాంత్‌పాటిల్

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

కర్నూలు జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన విక్రాంత్ పాటిల్ ఆదివారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్‌ని సంకల్ బాగ్‌లోని మంత్రి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు. జిల్లా శాంతిభద్రతల పరిరక్షణ కు తీసుకోవలసిన పలు అంశాలపై చర్చించారు.




ప్రతి ఒక్కరూ క్రీడల్లో సాధన చేయాలి

- ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై అవగాహన అవసరం

- సీనియర్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ శంకర్ శర్మ

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

ప్రస్తుతం పరిస్థితుల్లో ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా జీవించాలంటే క్రీడల్లో సాధన చేయడం తప్పనిసరి అని సీనియర్ గ్యాస్ట్రోఎంట్రాలజిస్ట్ డాక్టర్ శంకర్ శర్మ సూచించారు. కర్నూలు పెద్ద మార్కెట్ వద్ద ఉన్న ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన యూనివర్సల్ బుడోకాన్ కరాటే బెల్ట్ గ్రేడింగ్ పోటీలను ముఖ్య అతిథి డాక్టర్ శంకర్‌శర్మ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఈ కరాటే బెల్ట్ గ్రేడింగ్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు వివిధ రకాల బెల్టులను ప్రదానం చేశామని చెప్పారు. ముఖ్యంగా 1973 సంవత్సరకాలంలో తాము ఎంబిబిఎస్ చదివేప్పుడు బ్రూస్లీ నటించిన ఎంటర్ ది డ్రాగన్ చిత్రం చూసి మార్షల్ ఆర్ట్స్‌పై తమకు అవగాహన కలిగి తాము ఎందుకు నేర్చుకోలేకపోయాం అన్న ఆవేదన కలిగిందని చెప్పారు. మార్షల్ ఆర్ట్స్‌లో సాధన చేయడం వల్ల బాడీ ఫిట్ గా ఉండటంతో పాటు ఆరోగ్యంగా జీవించవచ్చని చెప్పారు. అందుకే తాను మార్షల్ ఆర్ట్స్‌ను ప్రోత్సహిస్తున్నానని వివరించారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో విద్యార్థులు కరాటే లాంటి మార్షల్ ఆర్ట్స్ శిక్షణ పొందడం వల్ల శారీరక మానసిక ఆరోగ్యం మెరుగుపడి చదువులోనూ రాణిస్తారని చెప్పారు. ప్రస్తుతం మారిన జీవనశైలి వలన చాలామందిలో చిన్న వయసులోనే ఊబకాయం, హైపర్ టెన్షన్, డయాబెటిస్, ఆర్థరైటిస్ వంటి దీర్ఘకాల ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని చెప్పారు. అందుకే క్రీడల్లో సాధన చేస్తే ఇలాంటి సమస్యలకు దూరంగా ఆరోగ్యకరంగా జీవించవచ్చని వివరించారు. ప్రస్తుతం డిజిటల్ టెక్నాలజీ కొత్త పుంతలు తొక్కుతున్న నేపథ్యంలో విద్యార్థులు చదువులోనూ రాణించాలని సూచించారు .ప్రస్తుతం కృత్రిమ మేధస్సు అన్ని రంగాల్లో కీలక పాత్ర పోషిస్తుందని, ఈ అంశంపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఈ డిజిటల్ టెక్నాలజీ యుగంలో విద్యార్థులు చదువులో ముందుండాలన్నారు. రోగ్యాన్ని కూడా పెంపొందించుకోవాలని సూచించారు. కరాటే శిక్షకులు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.


క్రీకాకారులకు సర్టిపికెట్లు ప్రదానం చేస్తున్న డాక్టర్ శంకర్ శర్మ

నేడు కలెక్టరేట్‌లో గ్రీవెన్స్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో సోమవారం ప్రజా సమస్యలు పరిష్కార వేదిక గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాష ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అన్ని మండల కేంద్రాల్లో కూడా కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు.

వక్ఫ్ చట్ట సవరణ రద్దు చేయాలి

- ఆవాజ్ ఆధ్వర్యంలో ధర్నా

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

వక్ఫ్ చట్ట సవరణను రద్దు చేయాలని పార్లమెంటులో ఈ బిల్లును టిడిపి కూటమి ప్రభుత్వం, జెడియు మద్దతు ఇవ్వరాదని ఆవాజ్ నగర కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు పి.ఇక్బాల్ హుస్సేన్, ఎస్ఎండి. షరీఫ్‌లు డిమాండ్ చేశారు. ఆదివారం కర్నూలు నగరంలోని గడియారం హాస్పిటల్ , డాక్టర్ మౌలానా అబుల్ కలాం ఆజాద్ చౌక్ సెంటర్‌లో షేక్‌నూర్‌వలి అహ్మద్ అధ్యక్షతన ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దళితుల పైన, ముస్లిం మైనార్టీల పైన అనేక రకాల దాడులను చేస్తున్నారన్నారు. వారి ప్రార్థన స్థలాలను కూల్చడం, రాజకీయం నడపడం, బహిరంగంగా శిక్షించడం అనేది జరుగుతా ఉందన్నారు. రాజ్యాంగాన్ని ఉల్లంఘించి ధ్వంసం చేసి పేద బడుగు బలహీన వర్గాల కార్మిక కర్షకుల హక్కులను కాలరాస్తున్నారన్నారు. ముస్లిముల హక్కులను కాల రాస్తుందని అందులో భాగంగానే యుసిసి, ఎన్ఆర్‌సిసి, త్రిబుల్ తలాక్ లాంటి దుర్మార్గమైన చట్టాలను తీసుకొని వచ్చి వారిని భయభ్రాంతులకు గురిచేయాలని చూస్తుందన్నారు. రాజ్యాంగంపై ప్రమాణం చేసి వచ్చి పరిపాలన చేస్తూ నిసిగ్గుగా తూట్లు పొడుస్తూన్నారన్నారు. దేశవ్యాప్తంగా 30 వక్ఫ్ బోర్డులను నిర్వర్యం చేయాలనే ఉద్దేశంతో చట్ట సవరణ చేశారన్నారు. వక్ఫ్ బోర్డు బలోపేతం పేరుతో ఉన్న చట్టాలను తొలగించి బలహీన పరచడానికి కావలసిన చట్టాలను ఆర్ఎస్ఎస్ కను సైగలలో బిజెపి ప్రభుత్వం కపట నాటకాలు ఆడుతుందన్నారు. తక్షణమే పార్లమెంట్లో బిల్లు రాకపోతే చట్ట సవరణను రద్దు చేయాలని, ఒకవేళ ఈ బిల్లు పార్లమెంటులో వస్తే ఆంధ్రప్రదేశ్‌లోని టిడిపి కూటమి ప్రభుత్వం, వైసిపి అధినేత జగన్ నాయకత్వంలో ఉన్న ఎంపీలు, బీహార్‌లో జెడియు అధినేత నితీష్ కుమార్ పార్టీలు తిరస్కరించాలని డిమాండ్ చేశారు. అలా చేయని పక్షంలో దళిత మైనార్టీలను సమీకరించి రాబోయే ఎన్నికలలో ఈ కూటమి ప్రభుత్వానికి గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. ఆవాజ్ నగర ఉపాధ్యక్షులు నాసిర్ అహ్మద్, తెలుగు పండిట్ నీసార్ అహ్మద్ మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం అధికారంలో వచ్చాక నల్లధనాన్ని బయటకు తెస్తామని, రూ.15 లక్షల జన్‌ధన్‌యోజన కింద ఒక్కో అకౌంట్లో వేస్తామని, సంవత్సరానికి రూ. రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని, నిత్యావసర వస్తువుల ధరలు తగ్గిస్తామని, రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంతోపాటు సబ్సిడీ రుణాలు ఇస్తామని, ఇలాంటి అబద్ధాలు పలికి అధికారంలోకి వచ్చి ఈ రోజు పేద మధ్యతరగతి ప్రజలపై మోయలేని భారాలు వేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంకో వైపు కులం పేరుతో మతం పేరుతో జాతి మత కుల ప్రాంతీయ మధ్య విభేదాలు సృష్టిస్తూ అధికార కాంచ చలిమంటను కాచు కుంటున్నారని నిప్పులు చెరిగారు. తక్షణమే వక్ఫ్‌బోర్డు చట్టసవరణ బిజెపి ఉపసంహరించుకోకపోతే కాంగ్రెస్‌కు పట్టిన గతే పడుతోందని హెచ్చరించారు. మహబూబ్ బాషా, కాజాపాషా, షేక్‌అహమద్, సలీం, గోరేభాయ్, షాషావలి, మూసమియా, ఇలియాజ్, షేక్షావలి అబ్దుల్ దేశాయ్, అబ్దుల్ నయీం, దావూద్, అల్లాహ్ బకష్ ,ఎండి నబి, చాంద్ బాషా, శాలి భాషా, బాబులీ తదితరులు పాల్గొన్నారు.



వక్ఫ్ చట్ట సవరణను రద్దు చేయాలని ధర్నా చేస్తున్న ఆవాజ్ నాయకులు, ముస్లిములు

బీమా రంగంలో 100 శాతం ఎఫ్‌డిఐ నష్టదాయకం

- అలా జరిగితే సమ్మెకు వెనుకాడం

- ఎల్ఐసి కర్నూలు బ్రాంచి ఎంప్లాయిస్ యూనియన్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ ప్రకటించిన మేరకు, ప్రయివేటు కంపెనీ బీమా రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి పరిమితిని 74శాతం నుండి 100 శాతానికి ఎఫ్‌డిఐ పెంచడం బీమారంగానికి, పాలసీదారులకు నష్టం జరిగేలా ఉందని కర్నూలు ఎల్ఐసి బ్రాంచ్ ఎంప్లాయిస్ యూనియన్ కార్యదర్శి ఆర్.సునియ కుమార్ అన్నారు. 100శాతం ఎఫ్‌డిఐ అంటే అర్థం స్వదేశీ భాగస్వామితో ప్రవేటు బీమా కంపెనీ లేకుండానే – ఒక విదేశీ ఇన్సూరెన్స్ కంపెనీ భారత దేశంలో నేరుగా ఏర్పాటు కావడం ఇదే జరిగితే భారతదేశంలో 1956కు ముందు పాలసీదారులను ముంచేసిన మోసాలు పునరావృతమవుతాయన్నారు. గ్రామీణ ప్రాంతాలకు కూడా బీమా రక్షణ విస్తరింపజేసి, పాలసీదారులకు చెల్లింపులు బాధ్యతగా, సకాలంలో చేస్తూ, దేశాభివృద్ధికి నిధులను అందిస్తున్న ఎల్ఐసిని పరోక్షంగా ఈ నిర్ణయం దెబ్బ తీస్తుందన్నారు. ప్రస్తుతం 74శాతం పరిమితి ఉన్న ఈ పరిస్థితిలో కూడా, కొత్తగా విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు ఆ మేరకు కూడా వచ్చింది లేదన్నారు. ఉపాధి అవకాశాల్ని సృష్టించింది లేదన్నారు. బీమా రక్షణను గ్రామీణ ప్రాంతాలకు అదనంగా విస్తరించింది లేదన్నారు. ఇన్సూరెన్స్ రంగం దీర్ఘకాలిక కాంట్రాక్టుకు అమలు పరిచే నమ్మకమైన స్థితిలో ఉండాలన్నారు. ప్రభుత్వ రంగంలోనో లేదా దేశీయ భాగస్వాములతోనో కలిసి ఉంటేనే మేలు జరుగు తుందన్నారు. భారత ఇన్సూరెన్స్ రంగంలో ఎఫ్‌డిఐలు వందశాతం అనుమతించిన తరువాత ఇప్పటి వరకు దేశీయ కంపెనీలతో భాగస్వాములుగా ఉంటూ నడిచిన అనేక కంపెనీలు తమకు తాము 100శాతం ఎఫ్‌డిఐని తెచ్చుకొని దేశీయ భాగస్వామ్య కంపెనీలను కాలదన్నడం ఖాయమని చెప్పారు. ఇదివరకే ప్రతిపాదించిన ఇన్సూరెన్స్ చట్ట సవరణలలో ఒక బీమా కంపెనీని నెలకొల్పడానికి కావాల్సిన కనీస మూల ధనాన్ని కూడా తగ్గించాలనే ప్రతిపాదన ఉందన్నారు. 100 ఎఫ్‌డిఐలకు అనుమతి దొరికిన తర్వాత విదేశీ కంపెనీలు అత్యంత తక్కువ మూల ధనంతో తమ దుకాణాలను ఇక్కడ తెరుచుకోవడానికి మార్గం మరింత సుగమం అయినట్లే అన్నారు. దీంతో పాటు ఇన్సూరెన్స్ చట్ట సవరణలలో మల్టిపుల్ ఏజెన్సీ అనగా ఒక ఏజెంట్ అనేక కంపెనీలతో ఏజెన్సీని కలిగి ఉండడం , ఏజెన్సీ పోర్టబిలిటీ అనగా ఓ ఏజెంట్ ఒక కంపెనీ నుండి మరో కంపెనీకి బదిలీ అయ్యే అవకాశం, పాలసీ పోర్టబిలిటీ అనగా ఒక పాలసీదారుడు ఒక కంపెనీ నుండి మరో కంపెనీకి మారిపోవడం.. వంటివన్నీ చకచకా జరిగిపోయేందుకు బీమా సుగమ్ అనేపేరున మూలధన ఆవశ్యకత లేకుండానే ఇంటర్నెట్ కెఫేలు లాంటి దుకాణాలు తెరుచుకునే వెసులుబాటును కూడా పొందుపరిచారని తెలిపారు. నేడు గుత్త సంస్థలు లాభాపేక్ష కోసం పెరుగుతున్న ఆ కాస్త మధ్యతరగతి వ్యక్తుల ఆదాయాలపై కన్నేసి లాభాలు ఆర్జించడానికి వేసిన పన్నాగంలో ప్రభుత్వాలు ప్రజలను సమిధలుగా మారుస్తున్నా యన్నారు. అఖిల భారత బీమా ఉద్యోగ ఉద్యోగుల సంఘం (ఎఐఐఇఎ) ఆధ్వర్యంలో ఈ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ఈ బడ్జెట్ సమా వేశాల్లో బీమా రంగంలో ఎఫ్‌డిఐ పెంచుతూ బీమా చట్ట సవరణ బిల్లు తీసుకొచ్చే అవకాశం ఉందని , అదే జరిగితే సమ్మెకైనా వెనకాడబోమన్నారు.




'తెలుగు కల్పవల్లి' శతకం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రచయితలు

తెలుగు కల్పవల్లి శతకం పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి-పత్తికొండ

పత్తికొండ గ్రంథాలయంలో అరసం జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి సత్యనారాయణ అధ్యక్షతన కమలా కళానికేతన్ సాహితీ సంస్థ 39వ వార్షికోత్సవ సందర్భంగా కవి, విమర్శకులు సవ్వప్ప గారి ఈరన్న రాసిన 73వ పుస్తకం' తెలుగు కల్పవల్లి' శతకం పుస్తకాన్ని ఆదివారం రచయితలు ఆవిష్కరించారు. పుల్లయ్య యాదవ్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కాసిం శెట్టి ,వేంకటేశ్వర యాదవ్ పుస్తకాన్ని సమీక్షించారు. కొత్తపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ సవ్వప్ప గారి ఈరన్న తెలుగు భాష పరిరక్షణకు చేస్తున్న కృషిని, ఆయన సాహితీ సేవను కొనియాడారు. ఆయన సాహితీ సేవ 1978 లో 'సంఘజీవి శతకం' తో ప్రారంభించి నేటికీ సాహితీ ప్రయాణం కొనసాగించడం అంటే సామాన్యమైన విషయం కాదన్నారు. సాహితీ సేవను ప్రభుత్వం గుర్తించాలన్నారు. కవులు రచయితలు సవప్పగారి ఈరన్నకు పూలమాల , శాలువా వేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో రంగన్న ,కాశీ విశ్వనాథ పాల్గొన్నారు.

టిడిపిపాలనలో కళాకారులకు గౌరవం

ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి

ప్రజాశక్తి -కర్నూలు కల్చరల్

తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు కళాకారులు కావటంతో టిడిపి పాలనలో కళాకారులకు సముచిత గౌరవం ఉంటుందని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి తెలిపారు. ఆదివారం రాత్రి టిజివి కళాక్షేత్రంలో గజ్జపూజ మహోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ తాను కళాకారుల క్షేమం కోసం కృషి చేస్తా అన్నారు. అదేవిధంగా కళావేదిక ఏర్పాటు చేయడానికి ఆమె హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పత్తి ఓబులయ్య మాట్లాడుతూ విద్యతో పాటు సాంస్కృతిక రంగంలో ప్రవేశం ఉంటే విద్యార్థులకు అభివృద్ధి ఉంటుందన్నారు. ప్రభుత్వ శారద సంగీత కళాశాల అధ్యాపకులు నాగసాయి ప్రదీప్‌కిరణ్ లెక్చరర్ పార్వతి, వైద్యురాలు అమృత సాయి తదితరులు పాల్గొన్నారు. కళాకారులను ఎమ్మెల్యే సత్కరించారు. అనంతరం విద్యార్థులు గజ్జపూజ, రంగ పూజ, శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు ఆహుతులను ఆకట్టు కున్నాయి.


నృత్యకళాకారులతో ఎమ్మెల్యే గౌరుచరిత, పత్తిఓబులయ్య , తదితరులు

'లౌసీ' సినిమా ప్రారంభం

క్లాప్‌కొట్టిన వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు వై ప్రదీప్ రెడ్డి

ప్రజాశక్తి- మంత్రాలయం

కలే కల్లప్ప హీరోగా కలే కల్లప్ప వృతి సినిమాస్ బ్యానర్ పై నిర్మిస్తున్న కన్నడ సినీమాకు వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు వై.ప్రదీప్‌రెడ్డి ప్రారంభించారు. ఆదివారం స్థానిక ప్రైవేటు అథిదిగృహంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. బెంగళూరుకు చెందిన కలేకల్లప్ప రచయితగా నిర్మాత హీరోగా చేయనున్న ఈ సినిమాలో హీరోయిన్‌గా అనూష నటించనుంది. డైరెక్టర్ వసంత కుమార్ రూ.కోటి బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ కన్నడ చిత్రం ఈనెల4 నుంచి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుందని తెలుగులో అనువాదం చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రదీప్‌రెడ్డి క్లాప్‌కొట్టి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సినీ నిర్మాత రియల్టర్ అగ్రహారం నాగిరెడ్డి, రియల్టర్ రంగారెడ్డి, నటీనటులు రజాక్, వినోద్, మేఘన, మోహన్ రావు, రోహిణి, గురు, తదితరులు పాల్గొన్నారు.



లౌసీ సినిమాను క్లాప్‌కొట్టి ప్రారంభిస్తున్న వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు వై ప్రదీప్ రెడ్డి

వైభవంగా కలశ ఊరేగింపు...

కుంభాభిషేకం కోసం ప్రత్యేక పూజలు..


ప్రజాశక్తి-కౌతాళం

శ్రీనరసింహ ఉరుకుంద ఈరన్న స్వామి కుంభాభిషేకం మహోత్సవం కోసం ఆదివారం పుణ్యక్షేత్రంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఫిబ్రవరి 3నన కంచి కామకోటి పీఠం పీఠాధిపతి శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి స్వామి, పుష్పగిరి మఠం పీఠాధిపతులు శ్రీ శంకరాచార్య శ్రీ విద్యా నరసింహ భారతి స్వామి వారు, శ్రీశైలం మఠం పీఠాధిపతులు శ్రీ చెన్న సిద్ధరామ శివచార్యస్వామి వారు, మంత్రాలయం మఠం పీఠాధిపతులు శ్రీ సుభతేంద్ర తీర్థ స్వామి, హాల్వి పీఠాధిపతులు శ్రీ మహంతేష్ స్వామి వారి చేత కలశ ప్రతిష్టాపన, విజయ గణపతి, శ్రీలక్ష్మి అమ్మవారు ప్రతిష్టాపన కార్యక్రమం చేపడుతున్నారు. ఇందుకోసం రెండవ రోజు దేవాలయంలో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు.

వైభవంగా ఊరేగింపు: ఉరుకుంద గ్రామంలో గ్రామస్తుల ఆధ్వర్యంలో కలశాలను ప్రత్యేక పూజలు నిర్వహించి ఊరేగించారు. భక్తి శ్రద్ధాలతో డప్పు వాయిద్యాలతో ఈ కార్యక్రమం అంగరంగ వైభవంగా చేపట్టారు. డిప్యూటీ కమిషనర్ విజయరాజు, గురు ప్రసాద్, వివిధ దేవాలయాల అసిస్టెంట్ కమిషనర్లు గంజి మల్లికార్జున, పాండు రంగారెడ్డి, పర్యవేక్షకులు వెంకటేష్ మల్లికార్జున, ప్రధాన అర్చకులు ఈరప్ప స్వామి, ఉప ప్రధాన అర్చకులు మహాదేవ, పూజన్న, ముఖ్య అర్చకులు నాగరాజు శివన్న, మల్లయ్య ఈరన్న, గ్రామ ప్రముఖులు కొట్రేష్ గౌడ్, కురుగోడు, చిరంజీవి మహాదేవ, అధికారులు, స్వామి వారి భక్తులు తదితరులు పాల్గొన్నారు. సిఐ అశోక్ కుమార్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.



ప్రత్యేక కలశపూజలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి , తదితరులు



ఊరేగింపులో నరసిహస్వామి

స్వామి సన్నిధిలో సుప్రీంకోర్టు న్యాయవాది: శ్రీ నరసింహ ఉరుకుంద స్వామి సన్నిధిలో సుప్రీంకోర్టు న్యాయవాది కాకర్ల చంద్రశేఖర్ కుటుంబం దర్శించుకుని పూజలు చేశారు. మహా కుంభాభిషేకం ప్రత్యేక కార్యక్రమాలలో పాల్గొన్నారు. దేవాలయ అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి పూలమాలలతో సన్మానించి శాలువాతో సత్కరించారు. తీర్థ ప్రసాదాలను అందజేశారు.

ట్రాక్టర్లతో అక్రమంగా ఎర్రమట్టి తరలింపు

-జెఎన్‌ఆర్ కన్‌స్టన్ నిర్వాకం
-జగనన్న కాలనీలోని ఇళ్ల పునాదులకు వేసేందుకు ఇప్పటికే వంద ట్రాక్టర్లతో పనులు
-తమ పంటలు నాశనం అయ్యిందంటున్న రైతులు
-ట్రాక్టర్లను పోలీస్‌స్టేషన్ కు తరలింపు
-మౌనం వహించిన పోలీసు రెవెన్యూ అధికారులు

ప్రజాశక్తి-మంత్రాలయం

ప్రభుత్వ అనుమతులు లేకుండా జెఎన్‌ఆర్ కన్‌స్ట్రక్షన్స్ నిర్వాహకులు అక్రమంగా ఎర్రమట్టిని తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. గత రెండు రోజులుగా మండల కేంద్రానికి సమీపంలో ఉన్న మెళ్ళి గుట్ట నుండి జెఎన్‌ఆర్ కన్‌స్ట్రక్షన్స్ ఆధ్వర్యంలో ఎమ్మిగనూరు నుండి ఇటాచీ ద్వారా గుట్టను పెకలించి ఆ మట్టిని సమీపంలో ఉన్న జగనన్న కాలనీలో గల నిర్మాణాల్లో ఉన్న ఇళ్ల పునాదులకు వేసేందుకు తరలిస్తున్నారు. విషయం తెలుసుకున్న రైతులు టిడిపి నాయకులు తిక్కారెడ్డి వర్గీయులు నియోజకవర్గ బిసి సెల్ జనరల్ సెక్రటరీ వట్టెప్ప గారి నరసింహ, చిన్న సుంకప్ప, గణేకంటి (సున్నం), రామకృష్ణ, ఎస్‌సి సెల్ జిల్లా కార్యదర్శి యోబు ఆదివారం తమ పొలాల మీదుగా మట్టిని ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నందున తమ పంటలు నాశనం అవడమే కాక పొలాలకు వెళ్లే రోడ్డు కూడా దెబ్బ తుంటుందని ట్రాక్టర్లను అడ్డుకున్నారు. ఈ నేపథ్యంలో సైట్ ఇంజనీర్ శ్రీనివాస్ చౌదరి తమకు అనుమతి ఉందంటూ గత వైసిపి ప్రభుత్వంలో సంతకం లేని ఉత్తర్వులను చూపించారు. ఇది చెల్లదని టిడిపి ప్రభుత్వంలో ఇచ్చిన ఉత్తర్వులు ఉంటే చూపాలని కోరారు. దీనిపై సైట్ ఇంజనీర్ గృహ నిర్మాణ శాఖ డిఇ లాలీ కృష్ణయ్య తో ఫోన్ ద్వారా టిడిపి నాయకులతో మాట్లాడుతూ వాగ్వివాదానికి దిగారు. తహసీల్దార్ ఎస్ రవికి కూడా ఫోన్ చేయడంతో విఆర్ఓ భీమన్నగౌడు, విఆర్ఎ నరసయ్య అక్కడకు చేరుకుని రైతులకు నష్టం జరిగితే ప్రశ్నిస్తారని వారికి అనుకూలంగా సమాధానం రాకపోవడంతో ఎస్ఐ శివాంజిల్‌కు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ ఆదేశాల మేరకు పోలీసులు ట్రాక్టర్లను పోలీస్‌స్టేషన్ కు తరలించారు. పై నుంచి సిఫారస్ రావడంతో రైతులకు రోడ్డు వేయించి పొలాలను చదునుచేసి ఇవ్వాలని ఒప్పందం కుదుర్చుకున్న అనంతరం పోలీసులు ట్రాక్టర్లను వదిలివేశారు. దీంతో వివాదం సద్దుమణిగింది. ప్రభుత్వానికి చెందిన మెళ్ళిగుట్ట నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా డబ్బు కట్టకుండా ఎగనామం పెట్టి అక్రమంగా తుంగభద్ర నది నుంచి ఇసుకను తరలిస్తూ నష్టం కలిగిస్తున్నారు.



ఎర్రమట్టి కనటాక్టర్లను అడ్డుకున్న టిడిపి నాయకులు

కేంద్ర బడ్జెట్‌లో ఎపికి అన్యాయం

సిపిఎం, ప్రజాసంఘాల నిరసన

ప్రజాశక్తి - ఆలూరు

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ లో రాష్ట్రానికి, కర్నూలు జిల్లాకు మొండి చేయి చూపిందని సిఐటియు జిల్లా సహాయకార్యదర్శి కెపి.నారాయణ స్వామి తెలిపారు. ఆదివారం ఆలూరు అంబేద్కర్ సర్కిల్లో కేంద్రప్రభుత్వ బడ్జెట్‌కు వ్యతిరేకంగా ప్రజాసంఘాల అధ్వర్యంలో నిరసన తెలిపారు. నారాయణ స్వామి మాట్లాడారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు షాకీర్, క్రిష్ణ, విఠల్, ఆటో యూనియన్ నాయకులు సద్దాం, ఈరన్న, ఐద్వా నాయకులు రత్నమ్మ, రాధమ్మ, డివైఎఫ్ఐ నాయకులు గోవర్ధన్ పాల్గొన్నారు.



ఆలూరులో నిరసన ప్రదర్శన

ఎమ్మిగనూరు: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో రాయలసీమకు తీవ్ర అన్యాయం జరిగిందని, మధ్యతరగతి ప్రజలకు ఒరిగిందేమీ లేదని సిపిఎం పట్టణ నాయకులు రాముడు విమర్శించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో అత్యంత వెనుకబడిన రాయలసీమ ప్రాంతానికి, ఈ ప్రాంతంలోని ప్రాజెక్టులకు, కొత్త పరిశ్రమలకు నిధులు కేటాయించలేదన్నారు. పేద మధ్యతరగతి ప్రజానీకానికి ఒరిగిందేమీ లేదన్నారు. గ్యాస్ విద్యుత్తు ఎరువులు ఇతర సబ్సిడీలకు నిధులు కేటాయించలేదని అన్నారు. రైతుల పండించిన పంటలు గిట్టుబాటు ధరకు బోనస్ ప్యాకేజీ లాంటి వాటికి ప్రత్యేక నిధులు కేటాయించ లేదన్నారు. స్త్రీ శిశు సంక్షేమ శాఖకు, కడప స్టీల్ ప్లాంట్ కు నిధులు కేటాయించాలని, గుండ్రేవుల వేదవతి ప్రాజెక్టు కేటాయించాలని డిమాండ్ చేశారు. సిపిఎం నాయకులు అబ్దుల్లా, కృష్ణ, సుభాన్, రమేష్, శివ,తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మిగనూరులో మాట్లాడుతున్న రాముడు

కృష్ణావధూత ఆశ్రమంలో సామూహిక వివాహాలు

-వధూవరులను ఆశీర్వదించిన రాఘువేంద్ర రెడ్డి
-తాళిబొట్లను ఇచ్చిన దేశాయి ప్రహల్లాద చారి

ప్రజాశక్తి- కౌతాళం

శ్రీ సద్గురు కృష్ణ అవధూత ఆశ్రమం 50వ వార్షికోత్సవం సందర్భంగా సామూహిక వివాహాలు ఆదివారం నిర్వహించారు. ఆర్లబండ మఠంతాత మద్రిస్వామి వారి ఆధ్వర్యంలో శిష్య బృందం సామూహిక వివాహాలను ఏర్పాటు చేశారు. ఇందులో ఎనిమిది జంటలకు పెళ్లి చేశారు. అనంతరం మద్రి స్వామివారికి ఘనంగా ఊరేగించారు. వధూవరులను మంత్రాలయం టిడిపి ఇన్చార్జ్ ఆశీర్వదించారు. ఆయన వెంట టిడిపి నాయకులు సురేష్ నాయుడు, తుంగభద్ర ప్రాజెక్ట్ చైర్మన్ టిప్పు సుల్తాన్, వెంకటపతి రాజు, రాజానందు, గిరి వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

తాళి,ముత్తు, మెట్లు ఇచ్చిన దేశాయి ప్రహ్లాద ఆచారి : శ్రీ కష్ణవధూత ఆశ్రమంలో వివాహాల్లో నూతన వధువులకు తాళి, ముత్తు, మెట్లు ఇచ్చి, వైసిపి మండల అధ్యక్షులు దేశాయ్ ప్రహ్లాదాచారి దాతృత్వాన్ని చాటుకున్నారు. సర్పంచి పాల్‌దినకర్, ఉప సర్పంచి సక్రితిక్కయ్య ,మాజీ సర్పంచి అవతారం, వార్డ్ మెంబర్ రామకృష్ణ, ఉమాపతి మండల నాయకులు సత్యప్ప స్వామి, సమ్మద్, వడ్డే అంజి, బసవ, జెసిపి డ్రైవర్ మారి ఖాదర్ లింగా తదతదితరులు పాల్గొన్నారు.



వధూవరులను ఆశీర్వదించిన రాఘువేంద్ర రెడ్డి

ప్రాథమిక పాఠశాలలను నిర్వీర్యం చేయొద్దు

ప్రజాశక్తి-ఆదోని: 117 జిఒను రద్దు చేస్తూ పాఠశాల విద్యా వ్యవస్థలో నూతన సంస్కరణలు పేరుతో ప్రాథమిక పాఠశాలలను నిర్వీర్యం చేయడం తగదని ఎస్‌టియుయు రాష్ట్ర కౌన్సిలర్ ఆకాడిమిక్ కమిటీ సభ్యులు మహాదేవప్ప పేర్కొన్నారు. అసంఘం కార్యాలయంలో ఆదోని, కౌతాళం మండలాల ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఎస్‌టియు ఆదోని మండలం అధ్యక్షుడు చింతకుంట రామకృష్ణ అధ్యక్షన నిర్వహించిన సమావేశంలో మహదేవప్ప మాట్లాడారు. జిఒ నెంబర్ 117 రద్దు పేరుతో ప్రాథమిక పాఠశాల విద్యా వ్యవస్థలో సంస్కరణలు పేరుతో గ్రామస్థాయిలో ఉన్న అన్ని ప్రాథమిక పాఠశాలలో ఒకే పాఠశాలలకు విలీనం చేయడం తగదన్నారు. వెంటనే ప్రాథమిక పాఠశాలల విలీనాన్ని ఆపాలని డిమాండ్ చేశారు. ఆదర్శ ప్రాథమిక ఫౌండేషన్ పాఠశాలలల పేరుతో ఒకే గ్రామంలో ఉన్న విద్యార్థులను ఒకే స్థాయిలో పాఠశాలలు ఏర్పాటు చేయడం అందులోనూ రెండు కిలోమీటర్లు దూరంలో ఉన్న ప్రాథమిక పాఠశాలను కూడా ఆదర్శ ప్రాథమిక పాఠశాలలోకి విలీనం చేయడం విద్యార్థుల పాలిట శాపంగా మారిపోతుందన్నారు. పేదల బడిని నిర్వీర్యం చేసే అవకాశం ఉందని, కాబట్టి ప్రాథమిక పాఠశాలల విలీనాన్ని వెంటనే ఆపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎస్‌టియు జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి ఎంసి.సుంకన్న మాట్లాడుతూ 117 జిఒ ద్వారా ద్వారా మిగిలిపోతున్న స్కూల్ అసిస్టెంట్లను 3,4,5 తరగతులు ఉన్న ఆదర్శ ప్రాథమిక పాఠశాలలకు కేటాయించాలన్నారు. ఇటీవల విడుదల చేసిన కేంద్ర బడ్జెట్లో ఆదాయ పన్ను చెల్లింపులు మినహాయింపులో రూ.12.75లక్షలు ఇస్తూ పాత పద్దతిలోనే 4లక్షల నుండి స్లాబులు ఏర్పాటు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. రూ.12. 75 వార్షిక ఆదాయం కలిగిన ప్రతిఉద్యోగికి ఆదాయ పన్ను మినహాయింపు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎస్‌టియు జిల్లా కార్యదర్శి గోపాల్, జిల్లా ఆర్థిక కమిటీ సభ్యులు రామాంజనేయులు, మండల ప్రధానకార్యదర్శి నాయకులు బి.సుధాకర్ బాబు, వి.రామాంజనేయులు ఎస్ఎస్. భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మహదేవప్ప

'ఫీజు పోరు'కు సిద్ధం

ప్రజాశక్తి-ఆదోని

విద్యా దీవన, వసతి దీవెన నిధులను విడుదల చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం తగదని మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదోనిలో వైసిపి ఆధ్వర్యంలో 'ఫీజు పోరు' పోస్టర్‌ను విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కౌన్సిలర్ ఫయాజ్ అహ్మద్, గౌరవ అధ్యక్షులు చంద్రకాంత రెడ్డి విడుదల చేశారు. వారు మాట్లాడారు కూటమి ప్రభుత్వం విద్యాదీవెన, వసతిదీవెన బకాయిలు చెల్లించకపోవడం వల్ల విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఫీజు చెల్లించకపోవడంతో విద్యార్థులను తరగతులకు అనుమతించడం లేదన్నారు. విద్యార్థుల హక్కులను కాపాడే ఉద్దేశంతో ఈనెల 5న అన్ని జిల్లా కేంద్రాల్లో కలెక్టరేట్‌ల ముందు "ఫీజు పోరు" ఉంటుందన్నారు. విద్యార్థుల భవిష్యత్తును కాపాడేందుకు ప్రభుత్వం తక్షణమే స్పష్టమైన ప్రకటన విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గౌరవ అధ్యక్షులు చంద్రకాంత్ రెడ్డి, విద్యార్థి విభాగం అధ్యక్షులు ఇసాక్, ఉమేష్, కౌన్సిలర్ రఘునాథ్ రెడ్డి, చలపతి, బాలాజీ, ముంబతి స్వామి, రామలింగేశ్వర యాదవ్, వైసిపి నాయకులు ఏసోబ్, సర్పంచి రామంజి, ఎరుకల రమేష్, పరిగెల నారాయణ, అయ్యప్ప, వేణు వున్నారు.



మాట్లాడుతున్న సాయిప్రసాద్‌రెడ్డి

4న ఎపిస్కిల్ డెవలప్మెంట్ జాబ్ మేళా

ప్రజాశక్తి - ఆలూరు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఆలూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈనెల4న జాబ్ మేళ నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎల్.ఆనంద్‌రాజ్ కుమార్, కళాశాల ప్రిన్సిపల్ వి.రమాదేవి ఆదివారం పత్రిక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల నిరుద్యోగ యువతీ, యువకులు ఈ జాబ్ మేళాలో పాల్గొని అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ జాబ్ మేళలో క్రెడిట్ యాక్సెస్ గ్రామీణ ఎల్‌టిడి ,సన్ కిసాన్ అగ్రి కో కంపెనీలు పాల్గొంటున్నట్లు తెలిపారు. జాబ్ మేళాలో హాజరు అయ్యే నిరుద్యోగ యువతీ, యువకులు విద్యార్హతలు పదవ తరగతి, ఇంటర్ ఏదైనా డిగ్రీ, చదివి 18-35 సంవత్సరాల లోపు వయసు కలిగిన అభ్యర్థులు అర్హులని, ఈ జాబ్ మేళా లో సెలెక్ట్ అయిన అభ్యర్థులకి నెలకి రూ.15 నుండి రూ.20 వేల వరకు జీతం ఉంటుందని తెలిపారు. ఇంటర్వ్యూలకు హాజరయ్యే అభ్యర్థులు ఖచ్చితంగా విద్యార్హత పత్రాలు జిరాక్స్, ఆధార్ కార్డ్, రెండు ఫోటోలతో అర్హత కలిగిన నిరుద్యోగ యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాల కోసం 9010003132 నంబర్ ను సంప్రదించాలన్నారు.

ఆలూరు బిజెపి ఇన్‌ఛార్జికి సతీవియోగం

ప్రజాశక్తి-ఆస్పరి



ఆస్పరి గ్రామానికి చెందిన ఆలూరు బిజెపి ఇన్‌చార్జ్ దుమ్ము వెంకటరాముడు సతీమణి లలిత (54) అనారోగ్యంతో శనివారం రాత్రి మృతి చెందారు. ఆదివారం లలితమ్మ మృతదేహానికి టిడిపి ఇన్‌ఛార్జి వీరభద్రగౌడ్, బిజెపి జిల్లా అధ్యక్షులు రామకృష్ణ, మాజీ అధ్యక్షులు కునిగిరి నీలకంఠ, కెడిసిసి మాజీ డైరెక్టర్ రాఘవేంద్ర పూలమాలాలు వేసి నివాళులర్పించి ఆమె కుటుంబాన్ని పరామర్శించారు.



ప్యాలకుర్తిలో సిసి రోడ్డు వేయాలి : సిపిఎం

ప్రజాశక్తి -కోడుమూరు రూరల్

ప్యాలకుర్తి గ్రామంలో గ్రామం నడిమధ్యన ఉన్న కోడుమూరు గూడూరు ప్రధాన రహదారి గుంతలమయంతో మురుగునీటితో నిండి ప్రజల రాకపోకలకు ఇబ్బందిగా మారిందని, సిసి రోడ్డు వేయాలని నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం సిపిఎం బృందం ప్యాలకుర్తిలో రోడ్డును పరిశీలించారు. సిపిఎం నాయకులు మాట్లాడుతూ కోడుమూరు నుండి గూడూరుకు ప్రజలు ఆటోలు, లారీలు ఇలాంటి వాహనాలు ఎన్నో రోజుకు తిరుగుతూ ఉంటాయని ఆ రహదారి పూర్తిగా దెబ్బతిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు ఇచ్చి పాడయిన దారుల్లో వెంటనే సిసి రోడ్లు వేయాలని, లేనిపక్షంలో గ్రామస్తులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సిపిఎం నాయకులు ఎర్ర మద్దిలేటి, గఫూర్ మియా, జిపి వీరన్న, జి మల్లికార్జున, గ్రామస్తులు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో ఎస్సీ, ఎస్టీలకు మొండిచేయి

- ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ ఆఫీసర్ల సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి రవి శంకర్

ప్రజాశక్తి - ఆదోని

జనాభా ప్రాతిపదికన బడ్జెట్లో నిధులు కేటాయించకుండా ఎస్సీ ఎస్టీలకు కేంద్ర ప్రభుత్వం మొండి చేయి చూపిందని ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ అధికారుల సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి విఎం రవి శంకర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం ఆదోనిలోని ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేంద్ర బడ్జెట్‌లో ఎస్సీ, ఎస్టీలకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. దేశవ్యాప్తంగా కోట్లాదిమంది జనాభా ఉన్న ఎస్సీలకు 15వేల కోట్లు, ఎస్టీలకు 15వేల కోట్ల చొప్పున బడ్జెట్ కేటాయించడం దారుణమన్నారు. కనీసం 10 శాతం కూడా బడ్జెట్లో నిధులు ఇవ్వకపోవడం చూస్తుంటే ఎస్సీ, ఎస్టీలపై వారికున్న బాధ్యత ఈపాటిదో అర్థమవుతుందన్నారు. ఏపీ, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలలో అమలవుతున్న ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ విధానాన్ని దేశవ్యాప్తంగా అమలు చేయాలన్నారు జనాభా ప్రాతిపదికన అయితే ఎస్సీ ఎస్టీలకు చేరో 13 లక్షల కోట్లు నిధులు బడ్జెట్లో ఇవ్వాల్సి ఉంటుందన్నారు. అరకొర నిధులు ఇచ్చి ఎస్సీ ఎస్టీల సంక్షేమాన్ని విస్మరించడం సమంజసం కాదన్నారు. ఎస్సీ ఎస్టీలను అణగదొక్కే దిశగా బిజెపి వ్యవహరిస్తుందని తెలుస్తోందని ఆరోపించారు. మార్చి నెలలో పార్లమెంట్లో ప్రవేశపెట్టే సవరణ బడ్జెట్‌లో నైనా ఎస్సీ ఎస్టీలకు జనాభా ప్రాతిపదికన నిధులు కేటాయించేలా చూడాలని కోరారు. త్వరలోనే ఢిల్లీ వెళ్లి అక్కడ కేంద్ర సామాజిక న్యాయశాఖ, ఆర్థిక శాఖ మంత్రులను కలిసి బడ్జెట్ ఆవశ్యకత గురించి విన్నవిస్తామన్నారు. ఎస్సీ ఎస్టీ ఎంపీలను ఆయా పార్టీల ప్రతినిధులను కలిసి ఎస్సీ ఎస్టీలకు జరగబోయే అన్యాయాన్ని వివరిస్తామన్నారు. బడ్జెట్లో నిధులు కేటాయించేలా పార్లమెంట్లో సమస్యను లేవనెత్తాలని విజ్ఞప్తి చేస్తామన్నారు.



నవ మంత్రాలయ నిర్మాత శ్రీ సుజయీంద్ర తీర్థులు

-ఘనంగా శ్రీ సుజయీంద్ర తీర్థుల ఆరాధన- పీఠాధిపతులు శ్రీ సుభుదేంద్రతీర్థులు

ప్రజాశక్తి-మంత్రాలయం

నవ మంత్రాలయ నిర్మాతగా ప్రసిద్ధి చెందిన శ్రీ మఠం పూర్వపు పీఠాధిపతులు శ్రీ సుజయీంద్ర తీర్థుల ఆరాధనను ఘనంగా నిర్వహించారు. ఆదివారం ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమెన మంత్రాలయంలోని శ్రీరాఘవేంద్రస్వామి మఠంలో ఉన్న శ్రీ సుజయీంద్ర తీర్థుల ఆరాధనను పుర ఆయన బృందావనాన్ని నిర్మాల్యం చేసి తులసి అర్చనతో పంచామృతాభిషేకం వంటి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం బృందావనాన్ని వెండి కవచాలతో, పట్టు వస్త్రాలతో వివిధ రకాల పూల మాలలు వేసి అందంగా అలంకరించారు. అనంతరం పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు శ్రీ సుజయీంద్ర తీర్థుల బృందావనాన్ని దర్శించుకొని మంగళ హారతులు ఇచ్చారు. ఈ సందర్భంగా నవరత్న స్వర్ణరథం పై శ్రీ సుజయీంద్ర తీర్థుల చిత్రపటాన్ని ఉంచి మంగళ హారతులు ఇచ్చిన అనంతరం మేళ తాళాలు మంగళ వాయిద్యాల నడుమ శ్రీమఠం ప్రాకారంలో ఘనంగా నవరత్న స్వర్ణ రథోత్సవాన్ని నిర్వహించారు. తదుపరి ఊయల మండపంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పీఠాధిపతుల శ్రీ సుభుదేంద్రతీర్థులు మాట్లాడుతూ మా పూర్వాశ్రమ తాతగారైన పూర్వపు పీఠాధిపతులు శ్రీ సుజయీంద్ర తీర్థులు శ్రీ మఠానికి చేసిన సేవలు మరువలేనివి అన్నారు.



ప్రత్యేక పూజా కార్యక్రమంలో పీఠాధిపతులు శ్రీ సుభుదేంద్రతీర్థులు

ఘనంగా మార్కండేయ స్వామి ఆలయ గోపుర కలశ ప్రతిష్టాపన

ప్రజాశక్తి-కోసిగి

మండల కేంద్రం కోసిగిలో పద్మశాలి కుల బంధువుల ఆరాధ్య దైవం శ్రీ భక్తమార్కండేయ స్వామి ఆలయంలో నూతనంగా నిర్మించిన గోపురశిఖర కలశ ప్రతిష్టాపన అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆదివారం తెల్లవారుజామున 4.30 గంటలకు ఆదోనికి చెందిన వేద పండితులు గరుడాద్రి వెంకటసుబ్బయ్య శాస్త్రి నేతృత్వంలో వేద మంత్రాలు పటిస్తుండగా కలస ప్రతిష్టాపన చేపట్టారు. ప్రతిష్టాపన అనంతరం ప్రాణ ప్రతిష్ట, శిలన్యాసము, అరుణ హోమం, ప్రతిష్ట దేవతల మూల మంత్ర హోమం, బలి హరణము, పూర్ణాహుతి, కుంభాభిషేకం, మహా మంగళ హారతులతో విశేష పూజలు చేశారు. ముఖ్య అతిథులుగా మంత్రాలయం ఎమ్మెల్యే వై.బాలనాగి రెడ్డి, హాజరైయారు. అయనకు వేద పండితులు పూర్ణకుంభంతో ఆహ్వానం పలికారు. ఎమ్మెల్యే స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు ఆలయ కమిటీ అధ్యక్షులు వై.ఆంజనేయులు ఆధ్వర్యంలో శాలువా పూలమాలవేసి సన్మానించి స్వామివారి మెమొంటోను అందజేశారు. ఎంపిపి ఈరన్న ,టిడిపి నియోజకవర్గ ఇన్చార్జ్ రాఘవేంద్ర రెడ్డి, టిడిపి జిల్లా యువ నాయకులు దివాకర్‌రెడ్డి, టిడిపి నాయకులు ముత్తురెడ్డి , రామిరెడ్డి ,పద్మశాలి సంక్షేమ సంఘం రాయలసీమ జోన్ అధ్యక్షులు కొంగతి లక్ష్మీనారాయణ, త్రిబుల్ ఐటీ కళాశాల రిజిస్టర్ కేతారి గురుమూర్తి, ఆదోని పద్మశాలి సంఘం అధ్యక్షులు నీలి లక్ష్మణస్వామి, బ్రహ్మానంద, కోసిగి సంఘం నాయకులు, జేరు బండి నరసింహులు, డాక్టర్ లక్ష్మన్న, డాక్టర్ నాగరాజు, వెంకటేష్, గడ్డం.శ్రీనివాసులు, గడ్డం. ఈరన్న తదితరులు పాల్గొన్నారు.



పూజ కార్యక్రమంలో మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి




డ్రైయినేజి బెడ్‌ను ఢీ కొన్న ప్రయివేటు బస్సు

అక్కడకక్కడే డ్రైవర్ మృతి

ప్రజాశక్తి - ఆలూరు

ప్రయివేట్ ప్యాసింజర్ బస్సు ఆలూరులో అదుపు తప్పి డ్రైనేజి బెడ్‌ను ఢీకొని డ్రైవర్ అక్కడకక్కడే మృతి చెందిన సంఘటన ఆదివారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు ఆదోని నుండి బళ్లారికి వెళ్లే కెఎ 384759 నంబర్‌గల మీనాక్షి ప్రయివేట్ ప్యాసెంజర్ బస్సు ఆలూరు లో మధ్యాహ్నం సాయి బాబా దేవాలయం ముందు డ్రెయినేజి బెడ్‌ను ఢీకొంది. డ్రైవర్ హుసేన్ సాహెబ్ (64) అక్కడికక్కడే మృతి చెందారు. ప్రయాణికులకు ఎటువంటి ప్రమాదం జరగక పోవడంతో అందరు ఊపిరికి పీల్చుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.



వధూవరులను ఆశీర్వదించిన టిడిపి నాయకులు

ప్రజాశక్తి-నందవరం

నందవరం గ్రామం కోట వీధిలో ఆదివారం బోయ జగన్నాథ్ కుమారుడి వివాహ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలో టిడిపి నాయకులు గురురాజ్ దేశయ్, నాగరాజు గౌడ్, వడ్డే గోపాల్, రామన్న గౌడ్ పాల్గొన్నారు. నూతన వధూవరులు వంశీ, శ్రావణిలను వారు అక్షింతలతో ఆశీర్వదించారు. షాదిక్, దానియేలు, చాకలి బజారి పాల్గొన్నారు.